సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 29 । జూన్ । 2025



హిందీని అమలు చేయాలి

జ్యోతినగర్: ప్రాజెక్టు అధికారిక పనుల్లో హిందీని అమలు చేయాలని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత సూచించారు. వివిధ విభాగాల్లో హిందీ అమలుపై ఆయన సమీక్షించారు.



ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

జూలపల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఆర్డీవో గంగయ్య అన్నారు. కుమ్మరికుంట ఎంపీపీఎస్ హెచ్ఎం అనంతరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది.
ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.
పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీపీకి ఉత్కృష్ట సేవా పతకం



అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: రామగుండం పోలీస్‌కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఈపతకం అందజేస్తుంది. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన అంబర్ కిశోర్ ఝా వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం పాటు వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకు ఈపతకానికి ఎంపికచేశారు. ఈసందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

'సిమ్స్'కు 150 ఎంబీబీఎస్ సీట్లు



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీలో కొత్తగా 150 ఎంబీబీఎస్ సీట్ల ఏర్పాటుకు ఆమోదం లభించిందని ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ తెలిపారు. శనివారం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఈ సీట్లకు అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చిందని వెల్లడించారు. నాలుగో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సిమ్స్‌లో మెరుగైన విద్యాబోధనతో పాటు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ సురేశ్

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో పాలిసెట్–2025 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ రమాకాంత్, కో ఆర్డినేటర్ సురేశ్‌కుమార్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే విద్యార్థులు పాలిసెట్ ర్యాంక్ కార్డు, పదో తరగతి మెమో, టీసీ, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు(1–1–2024 తర్వాత తీసుకున్నవి), ఆధార్‌కార్డు, ఈడబ్ల్యూఎస్ ఒరిజినల్, జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

'భట్టి' ప్రకటనతో ఆశలు

రామగుండం: సుమారు ఏడాది క్రితం మూతపడిన రామగుండంలోని 62.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ స్థానంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలని విద్యుత్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చేసిన ప్రకటన నియోజకవర్గ ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా జెన్‌కోలోని నిష్ణాతులైన ఇంజినీర్ల సేవలు వినియోగించుకుంటూ అత్యాధునిక పరిజ్ఞానంతో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని శనివారం హైదరాబాద్‌లో జరిగిన డైరెక్టర్ల సమావేశంలో ఎనర్జీ కార్యదర్శి, డైరెక్టర్లను భట్టి ఆదేశించారు. దీంతో కొత్త పవర్ ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్‌తో రజక నేతల భేటీ



రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్‌ను రజక సంఘం నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకే అందించి శాలువాతో సన్మానించారు. రజక సంఘం నాయకులు నిట్టూరి శ్రీనివాస్, నిట్టూరి రాజేశం, నిట్టూరి అంజయ్య, దీపక్, కొత్తకొండ శ్రీనివాస్, తోటపల్లి సంతోష్, నిట్టూరి మైసయ్య, నిట్టూరి కృష్ణ, నిట్టూరి శ్రీనివాస్, చాతల శివ, బుత్కూరి శంకర్, నిట్టూరి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 9మంది

పెద్దపల్లిరూరల్: స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశం కోసం చేపట్టిన ఎంపిక పోటీల్లో జిల్లాకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి సురేశ్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన విహాన్‌వర్ధన్, మోహన్నత్, రామగిరికి చెందిన ఈశ్వర్, జూలపల్లికి చెందిన అద్వైత్‌చంద్ర, పాలకుర్తికి చెందిన కుశ్వంత్, కమాన్‌పూర్‌కు చెందిన మణిరిత్విక్, మంథని కి చెందిన రహమత్‌అలీ, సుల్తానాబాద్‌కు చెందిన రుషికేశ్, తేజస్వి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారని పేర్కొన్నారు. హకీంపేటలో జరిగే పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఎస్కార్ట్‌గా ప్రణయ్, వెంకటేశ్ వ్యవహరిస్తారన్నారు.

పల్లెతల్లీ.. ప్రణమిల్లి



బోనం.. ఆగమనం

- ఆషాఢ మాసంలో బోనాల వైభవం
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక
- పల్లె తల్లులకు పట్టాభిషేకం
- ఇయ్యాల్టి నుంచి బోనాల వేడుకలు

సండే స్పెషల్

ఆషాఢ మాసం.. శుభకార్యాలకు దూరంగా ఉంటూనే పుణ్య కార్యాలకు, ఆధ్యాత్మిక వేడుకలకు ఆలవాలమైన మాసం. ఈమాసంలో తెలంగాణ పల్లె, పట్టణం బోనాల వేడుకలతో హోర్తెత్తిపోతుంది. ముల్లోకాలు కాపాడే అమ్మవారిని ఆరాధించడం బోనాల వెనుక సిసలైన నేపథ్యం. పోచమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామ దేవతలకు కొత్త కుండలో బోనం (భోజనం) నివేదన చేసి పిల్లాపాపల్ని చల్లగా చూడాలంటూ కోరుకుంటారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, మేళతాళాలతో మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారలకు నైవేద్యం సమర్పిస్తారు. ఆదివారం వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. – విద్యానగర్(కరీంనగర్)/సిరిసిల్లకల్చరల్

- వివరాలు 8లో ▶



ఉత్కంఠకు తెర

- 60 డివిజన్ల పునర్విభజన తుది జాబితా విడుదల
- ఇంకా వెల్లడించని ఇంటి నంబర్లు, కాలనీల పేర్లు
- హద్దులు మాత్రమే ప్రకటించిన బల్దియా అధికారులు



రామగుండం నగరం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో ఎట్టకేలకు 60 డివిజన్ల పునర్విభజన ఉత్కంఠకు తెరపడింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 21న తుది జాబితా ప్రకటించాల్సి ఉంది. కానీ, వారం తర్వాత 21వ తేదీతోనే జీవో ఎంఎస్ నంబర్ 145 ద్వారా శనివారం రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు విడుదల చేయడం గమనార్హం. నగరంలో ఇటీవల విలీనమైన లింగాపూర్, వెంకట్రావుపల్లి, ఎల్కలపల్లి గేట్, అక్బర్‌నగర్ గ్రామాలను కలిపి 60 డివిజన్లుగా విభజిస్తూ హద్దులతో కూడిన తుది జాబితా విడుదల చేశారు. డివిజన్ల సరిహద్దుల ముసాయిదాకు, తుదిజాబితాకు మధ్య భారీమార్పులు చోటు చేసుకున్నాయి. తుది జాబితాలో ఇంటి నంబర్లు, కాలనీల పేర్లకు చోటివ్వలేదు. ఒక్కో డివిజన్‌కు కేటాయించిన హద్దుల్లో పొందుపర్చిన ఇంటి నంబర్లు, కాలనీల పేర్లను వెల్లడిస్తేనే 60 డివిజన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తుదిజాబితా ప్రకటనపై జాప్యం?

రామగుండం నగరంలో 60 డివిజన్ల విభజనపై సీడీఎంఏ నుంచి తుది జాబితా విడుదలైనా.. మీడియాకు సమాచారం ఇవ్వడంలో అధికారులు జాప్యం చేశారు. శుక్రవారమే కరీంనగర్ నగర అధికారులు డివిజన్ల విభజనపై జీవో విడుదల చేస్తే.. శనివారం మధ్యాహ్నం వరకు కూడా రామగుండం బల్దియా అధికారులు జీవోను బహిర్గతం చేయలేదు. మీడియా ప్రతినిధులు.. పునర్విభజన జీవో సమాచారం కోసం ప్రశ్నల వర్షం కురిపించడంతో ఎట్టకేలకు సాయంత్రం జీవో విడుదల చేశారు.

అయోమయం.. గందరోళం..

తుదిజాబితాలో డివిజన్ల హద్దులు మాత్రమే ఇవ్వడం గందరగోళం, అయోమయానికి దారితీసింది. ఉత్తరం నుంచి తూర్పు, దక్షిణం, పడమర, తిరిగి ఉత్తరానికి హద్దులు మాత్రమే ప్రకటించడంతో చాలామంది నగరవాసులు డివిజన్లను అంచనా వేయలేకపోతున్నారు. ఏ ఇంటి నంబర్ నుంచి ఏ ఇంటినంబర్ వరకు, ఏ కాలనీ అనేది ప్రకటిస్తేనే తుది జాబితాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తుది జాబితా కూడా తప్పులతడకగా ఉందంటూ సోషల్ మీడియాలోనూ కామెంట్లు చేస్తున్నారు.

హద్దులు మాత్రమే ప్రకటన..

డివిజన్ల పునర్విభజనకు సంబంధించి శనివారం హద్దులు మాత్రమే విడుదల చేయడంతో పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. ఈనెల 4న జారీ చేసిన ముసాయిదాలో ఇంటి నంబర్లు, కాలనీల పేర్లతో 60 డివిజన్ల వివరాలను ప్రకటించారు. తుదిజాబితాలో డివిజన్ల హద్దులతోనే సరిపెట్టడం గందరగోళానికి దారితీసింది. ముసాయిదా తరహాలోనే ఇంటినంబర్లు, కాలనీల పేర్లతో కూడిన డివిజన్ల వివరాలను వెల్లడిస్తేనే అర్థం చేసుకోవడానికి సులువుగా ఉంటుందని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో వార్డుల విభజన చేపట్టిన 30 మున్సిపాలిటీలకు ఇదే తరహాలోనే తుదిజాబితా విడుదల చేసినట్లు తెలిసింది. కాగా, సోమవారం డివిజన్ల కాలనీలు, ఇంటి నంబర్లు ప్రకటించే అవకాశం ఉన్నట్లు కొందరు అధికారులు వెల్లడించారు.

ఆశావాహుల డివిజన్ల బాట..

మరోవైపు.. డివిజన్ల పునర్విభజన తుది జాబితా విడుదల కావడంతో మాజీ కార్పొరేటర్లు, ఆశావాహులు అప్పుడే కొత్త డివిజన్ల బాటపట్టారు. ముసాయిదా జాబితా తర్వాత తుదిజాబితాను సీడీఎంఏకు బల్దియా అధికారులు పంపించారు. ఈక్రమంలో ఓ జాబితా బల్దియా ఆఫీస్ నుంచి లీక్ అయ్యింది. ఈ జాబితా సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టింది. ఇదే జాబితాను ఫైనల్‌గా భావించిన చాలామంది ఆశావాహులు.. తాము కోరుకున్న డివిజన్లలో వారం రోజులుగా బస్తీపెద్దమనుషులతో టచ్‌లో ఉంటున్నారు. హద్దులతో కూడిన తుదిజాబితా మాత్రమే విడుదల కావడంతో మరికొందరు అర్థంకాక తలలుపట్టుకుంటున్నారు.

సమన్వయంతో పనిచేయాలి



పీవీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ శ్రీహర్ష తదితరులు

- విద్యుత్ సమస్యలు తలెత్తవద్దు
- పేషెంట్లను రెఫర్ చేసే పద్ధతి మానుకోండి
- ఎరువులు, విత్తనాలపై రైతులు ఆందోళన చెందవద్దు
- పైలెట్ ప్రాజెక్టుగా రేషన్ షాపు వద్ద సూపర్ మార్కెట్
- జిల్లా అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష

మంథని: అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై శనివారం ఆయన సమీక్షించారు. భవిష్యత్ అవసరాలు, పీక్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సబ్‌స్టేషన్లు, అదనపు లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గంగదేవిపల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి వారంలోగా శంకుస్థాపన చేయాలని, మచ్చుపేటలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలను ఎస్ఈ పరిష్కరించాలన్నారు. వచ్చే మూడు నెలలపాటు విద్యుత్ సరఫరా చాలాకీలకమని, అధికారులు అప్రమత్తం ఉండాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అవసరమైనన్ని ఉన్నాయని తెలిపారు. అర్హులకు రేషన్‌కార్డులు జారీచేయాలని, పైలెట్ ప్రాజెక్టు కింద ఒకరేషన్ షాప్ వద్ద సూపర్ మార్కెట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. మంథని ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు ఇక్కడే వైద్యసేవలు అందించాలని, గోదావరిఖని, పెద్దపల్లి లాంటి ప్రాంతాలకు రెఫర్ చేయొద్దని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని అన్నారు. సబ్‌సెంటర్ల భవన నిర్మాణ పురోగతి, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. పీహెచ్‌సీల్లో పరికరాలు, సామగ్రి అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌కు సూచించారు. తాగునీటి కోసం వారంరోజుల్లోగా మిషన్ భగీరథ, పాతవ్యవస్థ పునరుద్ధరించాలన్నారు. ఎస్సారెస్పీ కాలువల్లో ఈజీఎస్ ద్వారా ఏటా పూడిక తొలగించాలని అన్నారు. పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల డీపీఆర్ పూర్తిచేయాలని, పోడు భూముల పట్టాలు ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆదేశించారు. గ్రామాల్లో కొత్త రూట్ల కనీసం 10 రోజులు బస్సులు నడపాలని అన్నారు. మంథని బస్టాండ్ ఆధునీకీకరణ ప్రారంభించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు పెరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ, రామగిరి మండలం సుందిళ్లలో సింగరేణి మైనింగ్ లీజ్ భూముల పరిహారం అర్హులకు అందించేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేశామన్నారు. జాతీయ రహదారి పెండింగ్ భూ సేకరణ 80 శాతం అవార్డు పాస్ చేశామని తెలిపారు. అంతకుముందు రామగిరి, ముత్తారం, మంథని, మండలాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు నివాళి అర్పించారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వాలి

- సీఎస్‌కు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తి
- రాష్ట్ర మంత్రిని కలిసిన మక్కాన్‌సింగ్



చీఫ్ సెక్రటరీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ పథకం ద్వారా అదనపు నిధులు మంజూరు చేయాలన్నారు. రోడ్ల ఆధునికీకరణకు రూ.120 కోట్లు, డ్రైనేజీ నిర్మాణానికి మరో రూ.80 కోట్లు, డిగ్రీ కాలేజీ భవనం, ల్యాబ్, కంప్యూటర్ సౌకర్యం, మహిళలు, విద్యార్థుల రక్షణ దృష్ట్యా ప్రత్యేక బాలికల హాస్టల్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. రామగుండంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రూ.250 కోట్లు అవసరం ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు స్థలాల కేటాయించాలన్నారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పన కోసం ప్రత్యేకంగా రూ.వంద కోట్లు అవసరమన్నారు. హరితహారం, పచ్చదారుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.25 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థనపై చీఫ్ సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనరసింహను ఎమ్మెల్యే ఠాకూర్ కలిసి విన్నవించారు. జనాభా, నగర విస్తరణ, ఆస్పత్రిపై అధిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 108 వాహనాల సంఖ్య పెంచాలన్నారు. వైద్యసిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. పీడియాట్రిక్, గైనకాలజీ, ట్రామాకేర్ విభాగాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సిమ్స్ వద్ద రాజీవ్ రహదారిపై పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అన్నారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న పెండ్యాల మహేశ్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కేసీఆర్ పాలన.. శ్రీరామరక్ష' పేరిట బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో తిరిగే ప్రయత్నం చేస్తున్నారని, అయితే, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు.. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట ఎంతమందిని మోసం చేశారో ప్రజలు చూశారన్నారు. ఐదేళ్లపాటు రాక్షస పాలన సాగించిన కోరుకంటి చందర్ చేసిన అభివృద్ధి, 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. బయ్యపు మనోహర్‌రెడ్డి, రాజ్‌కుమార్ యాదవ్

పేదలకు ప్రజాప్రభుత్వం అండ

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



లబ్ధిదారులకు చెక్కులు, రేషన్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు/జూలపల్లి/సుల్తానాబాద్(పెద్దపల్లి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తూ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వారికి అండగా ఉంటోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రేషన్‌కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు. రహదారులు, కుల సంఘ భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. సుల్తానాబాద్ ఎస్‌వీఆర్ గార్డెన్‌లో కొత్త రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు, ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. తహసీల్దార్లు యాకన్న, స్వర్ణ, బషీరొద్దీన్, ఎంపీవో కిరణ్, ఏపీఎం సుధాకర్, ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, ఎంపీడీవోలు పద్మజ, దివ్యదర్శన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్లు గండు సంజీవ్, ప్రకాశ్‌రావు, నాయకులు వేణుగోపాలరావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, పుల్లారావు, పరుశరాములుగౌడ్, కొండ తిరుపతిగౌడ్, కొడయ్య, పెద్ది కుమార్, వెంకటసత్యం, రమేశ్, వెంకట్‌రెడ్డి, పూరెల్ల శ్రావణ్, బొద్దుల లక్ష్మణ్, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్/ఎలిగేడు: సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ ఎమ్మెల్యే విజయరమణారావును శివపల్లిలో కలిసి బొకే అందజేశారు. పలు విషయాలపై చర్చించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: శాంతిభద్రతలు, నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. కమిషరేట్ కార్యాలయంలో శనివారం ఆయన నేరసమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతికత వినియోగిస్తూ, శాస్త్రీయ పద్ధతి అవలంబించాలన్నారు. ప్రతీరోజు ఒక గంట పెండింగ్ కేసులపై సమీక్షించాలన్నారు. మహిళలపై జరిగే నేరాల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. విధుల్లో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి డీసీపీలు భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, మంచిర్యాల, పెద్దపల్లి, జైపూర్, బెల్లంపల్లి, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, ప్రకాశ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

ఈఅండ్ఎం అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలోని ఈఅండ్ఎం అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఆదేశాలు జారీ చేసింది. కార్పొరేట్ ట్రాన్స్‌పోర్టు జీఎం సీతారామంను సోలార్ ఎనర్జీ కార్పొరేట్‌కు, బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ ఎం.రామానందంను కార్పొరేట్ ట్రాన్స్‌పోర్టు జీఎంగా, హైదరాబాద్ ఈఅండ్ఎం హెచ్‌వోడీ ఎన్‌వీకే విశ్వనాథరాజును విజయవాడ అప్మెల్ ఎండీగా, ఐటీ హైదరాబాద్‌లో పనిచేస్తున్న జీవీఎస్ గురుప్రసాద్‌ను ఈఅండ్ఎం హెచ్‌వోడీగా బదిలీ చేశారు.

మైనింగ్ అధికారులు..

కొత్తగూడెం క్వాలిటీ జీఎం మేకల కనకయ్యను కార్పొరేట్ ఆర్అండ్‌డీ జీఎంగా బదిలీ చేశారు. ఐఅండ్‌పీఎం హెచ్‌వోడీ జె.వెంకటరమణను కొత్తగూడెం క్వాలిటీ జీఎంగా, కార్పొరేట్ సీపీపీ శ్రీహరిని ఐఅండ్‌పీఎంగా బదిలీ చేశారు. ఆర్జీ–1 ఎస్వోటూ జీఎంగా పనిచేస్తున్న గోపాల్‌సింగ్‌ను బెల్లంపల్లి రీజియన్ హెచ్‌వోడీగా బదిలీ చేశారు.

క్లుప్తంగా

ముంబయ్‌లో పొరండ్ల వాసి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొరండ్లకు చెందిన పర్స రమేశ్ (40) ముంబయ్‌లో శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ కొద్దికాలంగా ముంబయ్‌లోని కామటిపూర్ కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులకు ఫోన్ మాట్లాడాడు. అనంతరం ఉరేసుకున్నాడు. కల్లు దుకాణం నిర్వాహకుడు రమేశ్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రమేశ్‌కు భార్య భాగ్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..


అశోక్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. లక్ష్మీపూర్‌కు చెందిన ముగ్గం అశోక్ (25) పెళ్లి కాకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. తన అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి పురుగుల మందుతాగి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో అశోక్‌ను హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శనివారం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా ప్రాణాలు పోయాయి. మృతుడికి తండ్రి రాజయ్య, అన్నలు మహేశ్, సురేశ్ ఉన్నారు. మృతుడి చిన్నాన్న రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తంగళ్లపల్లి ఎస్సై ఎం.ఉపేంద్రచారి తెలిపారు.

చికిత్సపొందుతూ విద్యార్థి మృతి


వైష్ణవి(ఫైల్)

గన్నేరువరం: గన్నేరువరంకు చెందిన కూన వైష్ణవి(14) అనే విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. కూన సంపత్- అనిత కూతురు వైష్ణవి గన్నేరువరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంది. 8వ తరగతి చదివేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఒక గురుకుల పాఠశాలలో ఇటీవల సీటు లభించింది. దీంతో ఈ ఏడాది విద్యాభ్యాసానికి తల్లిదండ్రులు హాస్టల్ పంపించారు. అక్కడ ఉండి చదువుకోవడానికి వైష్ణవి నిరాకరించడంతో తండ్రి ఇంటికి తీసుకొచ్చాడు. హాస్టల్లో ఉంటూ చదువుకోవాలని తల్లిదండ్రులు కోరగా.. చదువుకోనని మనస్తాపం చెంది ఈనెల 23న పురుగు ల మందు తాగింది. గమనించిన కుటుంబ స భ్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో మెరుగైన చి కిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లెతల్లీ.. ప్రణమిల్లి

విద్యానగర్ (కరీంనగర్) /సిరిసిల్లకల్చరల్:

బోనం అంటే భోజనం. అమ్మ ప్రసాదించిన ఆహారాన్ని అమ్మకే నివేదించడం బోనాల సంప్రదాయం. జగన్మాత ఉత్సవంలో ఘటం, బోనం, రంగం.. అంటూ మూడు అంకాలుంటాయి. శక్తి పూజకు స్త్రీమూర్తులే ప్రధానమైన భూమిక పోషించడం బోనాల ప్రత్యేకత. కొత్త కుండకి సున్నం, పసుపు రాసి, కుంకుమ అద్దుతారు. చందనం చల్లుతారు. వరి లేదా జొన్నతో నింపిన ఘటానికి మామిడాకులు, వేపరెమ్మలు కడతారు. దీపం వెలిగించడానికి అనుకూలంగా కుండపైన మట్టి మూకుడు పెడతారు. అలా ఘటాలను అలంకరించి, ఊరేగింపుగా వెళ్లి అమ్మవారలకు బోనాలు సమర్పిస్తారు. దేహదారుఢ్యం కలిగిన వ్యక్తిని పోతురాజుగా ముందు నిలబెడతారు. అన్ని ఇళ్ల నుంచి బోనాన్ని సేకరించడం పోతురాజు బాధ్యత. బోనాల సమర్పణకు ముగింపుగా ఆ ఏటి భవిష్యత్తును ప్రకటించడమే 'రంగం'. ఓ భక్తురాలే భవిష్యవాణిని వినిపిస్తుంది.



విశ్వవ్యాప్తం

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టి జనపదాల్లో పుట్టిన ఈ వేడుక నేడు విశ్వవ్యాప్తమైంది. ఆషాఢ మాసంలో జగన్మాతకు భక్తితో సమర్పించే భోజన నైవేద్యాలలే బోనాలు. భోజన పదమే జనవ్యవహారంలో బోనంగా మారింది. ప్రతీ ఇల్లు సిరులతో నిండి అందరూ ఆయురారోగ్య భాగ్యాలతో విలసిల్లాలని వేడుకోవడం బోనాల పండుగలోని ప్రత్యేకత.

తెలంగాణ తల్లికి బోనం

మెట్లకు బొట్లు, గట్లకు పూజ. గోపురాల కొత్త పరిమళ గుబాలింపు. అమ్మ రుణం తీర్చుకునే వేడుకల్లో ఇవన్నీ భాగమే. అమ్మవారు ఆప్యాయతల అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుందోనని.. అంబారీనెక్కి ఆశీర్వాదాలు పలుకుతుందోనని.. రంగమెత్తి సందేశమిస్తుందోనని 'అమ్మా.. తల్లీ.. కాపాడమ్మా' అని వేడుకునే మనుసులు ఆషాఢమాసం నెల పాటు ఉత్సవాలు చేసుకుంటారు. ఊరుగాచే ఆ తల్లికి బోనం పెట్టే బిడ్డలు ఉన్నది ప్రపంచంలో ఒక్క తెలంగాణలోనే.

గోల్కొండలో తొలి బోనం

ఆషాఢమాసంలో గోల్కొండ ఖిల్లా వేదికగా, ఉజ్జయినీ తల్లి సాక్షిగా అమ్మకు బిడ్డలు తొలి వీర బోనమెత్తుకుంటే రాష్ట్రమంతటా బోనాల నగారా మోగుతుంది. గోల్కొండ కోటలోని శ్రీజగదాంబికా ఆలయంలో జరిగే ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇది తరాలు మారినా తరగని తెలంగాణ సంస్కృతికి నిదర్శనం.

బోనంతో అనుబంధం

ఆషాఢానికి బోనాలు ఆరంభమై శ్రావణానికి గ్రామాలకు చేరి గ్రామదేవతలైన మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మల రుణం తీర్చుకుంటాయి. అదే ఆ అమ్మలకు ఈ బిడ్డలకు ఉన్న అనుబంధం. 500 ఏళ్ల క్రితం మలేరియా వల్ల ప్రాణాలు పోతున్న వేళ జనాన్ని రక్షించేందుకు పెట్టిన తొలి బోనం ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగడం అంటే అమ్మ- బిడ్డల అనుబంధానికి నిదర్శనం.

చరిత్ర వైభవం

పురాణగాథలు, చారిత్రక నేపథ్యాలతో సంబంధం లేకుండా ఆయా ప్రాంతాల ప్రజలు బంధుమిత్రులు, కుటుంబాలతో కలిసిమెలిసి ఈ పండుగ జరుపుకుంటున్నారు. గోల్కొండ జగదాంబిక (ఎల్లమ్మ)



ఆలయంలో మొదలయ్యే బోనాలు లష్కర్ ఉజ్జయినీ మహంకాళి, లాల్‌దర్వాజ సింహవాహిని, హరిబౌలి మహంకాళి ఆలయాల్లో జాతర వేడుకలు జరుగుతాయి. గోల్కొండ బోనాలకు 500 ఏళ్ల, ఉజ్జయినీ బోనాలది 200 ఏళ్ల చరిత్ర. లాల్‌దర్వాజ బోనాలకు వందేళ్ల చరిత్ర ఉంది.

అమ్మవారికి బోనం సమర్పిస్తాం



ఏటా ఆషాఢమాసంలో మా ఇంటి నుంచి పోచమ్మతల్లికి బోనం సమర్పిస్తాం. వాడలోని వారందరితో డప్పుచప్పుల్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టి, మొక్కులు చెల్లించి సల్లంగా చూడాలని వేడుకుంటాం.

– చొప్పరి జయశ్రీ, మాజీ కార్పొరేటర్, కరీంనగర్

గడ్డి మందును నిషేధించాలి

కరీంనగర్‌అర్బన్: పారా క్వాట్ హెర్బిసైడ్ (గడ్డిమందు)పై దేశవ్యాప్తంగా నిషేధం విధించేలా చర్యలు తీసుకోవాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) జిల్లా శాఖ, డాక్టర్స్ అగైన్స్ట్ పెరాక్విడ్ పాయిజన్ (డీఏపీపీ) శనివారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేసింది. పారాక్వాట్ అత్యంత విషపూరితమైన ఔషధమని, 10–15 మి.లీ తాగినా మృతిచెందడమేనని, ఇది చాలా వేగంగా గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తుల్ని దెబ్బతీసి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీస్తుందని వివరించారు. సదరు గడ్డి మందు తీసుకొని దేశంలో చాలామంది అత్యంత సాధారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి విరుగుడు మందు లేకపోవడం వల్ల 50 శాతం నుంచి 90 శాతం వరకు మృత్యువాత పడుతున్నారని, పొలాలపై వేసే క్రమంలో తెలియకుండానే రైతుల ఊపిరితిత్తుల్లోకి వెళ్లి తీవ్రమైన అనారోగ్యాలకు గురి అవుతున్నారని తెలిపారు. పారా


కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ బృందం

క్వాట్ ఉత్పత్తి, అమ్మకం, నిల్వ, వినియోగంపై తక్షణ నిషేధం విధించాలని, మార్కెట్‌లో ఉన్న స్టాక్‌ను వెనక్కి తీసుకొని సురక్షితంగా నిర్వీర్యం చేయాలన్నారు. పారాక్వాట్ విష ప్రయోగాలను పర్యవేక్షించేందుకు ‹పాయిజన్ రిజిస్ట్రీ ఏర్పాటు చేయాలని, యూరప్, బ్రిటన్, బ్రెజిల్, చైనా, శ్రీలంక, దక్షిణకొరియా లాంటి దేశాలు ఇప్పటికే నిషేధించాయని పేర్కొన్నారు. హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.బండారి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు డా.పి.గౌతమ్, ప్రధాన కార్యదర్శి డా.జీఎస్.శరణ్ పాల్గొన్నారు.

నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనం పీవీ

కరీంనగర్‌టౌన్: తెలుగు తేజం, గొప్ప రాజనీతిజ్ఞుడు, భారతరత్న ప్రధానమంత్రి పదవిని చేపట్టిన ఏకైక తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆ మహానుభావుడికి నివాళి అర్పిస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. తన భూములను పేదలకు పంచి ఉమ్మడి రాష్ట్రంలో భూ సంస్కరణలకు బీజం వేసిన భూదాత అని, దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా పీవీ చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక ప్రగతికి పునాది వేశాయన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో కలిపేందుకు జరిగిన 'తెలంగాణ విమోచన ఉద్యమం'లో కీలక పాత్ర వహించి అఖండ భారతావని కోసం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలను కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించాయన్నారు. మాజీ ప్రధాని పీవీ చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు జరగనీయకుండా అవమానించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా పీవీ జ్ఞాన వేదికతోపాటు పీవీ ధ్యాన మందిరం, పీవీ విగ్రహ ఏర్పాటు వంటి పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అంజన్న గర్భగుడి దర్శనం సులభం


గర్భగుడి దర్శనం చేసుకుంటున్న భక్తులు


క్యూలైన్ల ద్వారా దర్శనం చేసుకుంటున్న భక్తులు

- ధర్మదర్శనం క్యూలైన్ దూరం పెంపు

మల్యాల: కొండగట్టు అంజన్నను భక్తులు దర్శించుకునేందుకు ఆలయ అధికారులు కొన్ని మార్పులు చేపట్టారు. భక్తులకు గర్భగుడి దర్శనం కల్పించేలా ధర్మదర్శనం క్యూ లైన్‌ను పది అడుగుల దూరం పెంచారు. ఆలయ ఆదాయం పెంపు కోసం గర్భగుడి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెంచేందుకు.. వారు గర్భగుడి వద్ద కూర్చుని స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. గతంలో సాధారణ క్యూలైన్ల ద్వారా స్వామివారిని అతి సమీపం నుంచి దర్శించుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం మరో పది అడుగుల దూరం నుంచి స్వామివారి దర్శనం ఉండనుంది. ప్రస్తుతం గర్భగుడి దర్శనం టికెట్ ధర రూ.400 నుంచి రూ.800కు పెంచే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆలయ ఆదాయం పెంపుపై దృష్టి సారించిన అధికారులు.. భక్తులకు వసతి సౌకర్యాల ఏర్పాట్లపైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఏసీబీ వలలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

- ఇంటి నంబర్ కోసం లంచం
- రూ.5 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


బాధితుడు ప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఇంటి నంబరు కేటాయించాలని దరఖాస్తు చేసిన వ్యక్తి నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నాంపల్లి విజయ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆర్నకొండ ప్రసాద్ ఇటీవల ఇల్లు నిర్మించుకున్నారు. దానికి ఇంటి నంబరు కేటాయించాలని అధికారులను ఆశ్రయించారు. అయితే, రూ.10 వేలు లంచం ఇస్తేనే ఇంటి నంబరు కేటాయిస్తామని అధికారులు డిమాండ్ చేశారు. తాను రూ.3 వేలు చెల్లిస్తానని బతిమిలాడినా వినలేదు. చివరకు రూ.5 వేలకు ఒప్పందం కుదిరింది. శనివారం పట్టణంలోని ఓ దుకాణంలో ఆర్నకొండ ప్రసాద్


ఏసీబీ అధికారులకు పట్టుబడిన విజయ్ కుమార్, వినోద్ కుమార్

రూ.5 వేలు ఇస్తుండగా మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నాంపల్లి విజయ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్‌నూ అదుపులో తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, సీఐ కృష్ణకుమార్, సిబ్బంది పున్నం చందర్, తిరుపతి పాల్గొన్నారు. నిందితులను ఆదివారం కోర్టులో హాజరు పర్చనున్నామని అధికారులు తెలిపారు. కాగా, ఇంటి నంబరు కేటాయించాలని బాధితుడు రెండేళ్లుగా తిరుగుతున్నాడని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ కేసులో అరెస్ట్

మంథని: వరుస దొంగతనాలతో పట్టణ ప్రజల్లో నెలకొన్న భయాందోళనకు పోలీసులు తెరదించారు. కేవలం నాలుగు రోజుల్లోనే రెండు చోరీలను ఛేదించారు. ఈ నెల 22న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో గ్రామానికి వెళ్లిన ఇల్లెందుల వెంకటేశ్వర్లు ఇంట్లో చోరీచేసిన స్థానికుడు తిరునహరి రాజనర్సింహస్వామిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా కేసును ఛేదించి, టీవీ, వెండివస్తువులను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించనట్లు పేర్కొన్నారు.. కేసును ఛేదించిన ఎస్సై రమేశ్, ఏఎస్సై స్వామి, కానిస్టేబుళ్లు రమేశ్, రాజ్‌కుమార్, శివ, అశోక్‌ను సీఐ అభినందించారు. అలాగే కరీంనగర్‌కు చెందిన చీర్ల తిరుపతిరెడ్డి స్థానిక పెట్రోల్ బంక్‌లో ద్విచక్రవాహనం పార్క్ చేసి వెళ్లగా.. ఈనెల 27న అదృశ్యమైంది. ఈ కేసులో మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన రత్నం రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు, ఎస్సై రమేశ్

ఎంత పనిజేస్తివి కొడుకా..

- దత్తపుత్రుడి మృతితో ఒంటరైన తల్లి
- ఆరేళ్ల క్రితం తండ్రి.. నేడు కొడుకు మృతి


అజయ్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎంత పనిజేస్తివి కొడుకా.. పిల్లలు లేరని నిన్ను సాదుకుంటే మధ్యలో అన్యాయం చేస్తివా.. అంటూ ఆ మాతృమూర్తి రోదనలు స్థానికులు కన్నీరు పెట్టేలా చేశాయి. కట్టుకున్న భర్త ఆరేళ్ల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడితే.. సంతానం లేక ఆసరాగా ఉంటాడనుకున్న దత్తకొడుకు సైతం ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ తల్లి ఒంటరైంది. పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న తెల్లవారే యువకుడు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బద్దిపడిగె మల్లారెడ్డి, విజయ దంపతులకు సంతానం కలగకపోవడంతో అజయ్‌రెడ్డిని దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ఆరేళ్ల క్రితం తండ్రి మల్లారెడ్డి ఆత్మహత్య చేసుకోగా, తల్లి విజయ అన్నీ తానై కొడుకును పోషిస్తోంది. ముస్తాబాద్‌లోని ఓ పెట్రోల్‌బంకులో పనిచేస్తున్నాడు. శుక్రవారం పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న మరుసటి రోజే ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లి విజయ రోదనలు మిన్నంటాయి. ఆరేళ్ల క్రితం భర్త ఆత్మహత్య చేసుకోగా, ఇప్పుడు కుమారుడు అజయ్‌రెడ్డి(22) కూడా ప్రాణాలు తీసుకోవడంతో విజయ ఒంటరైంది. యువకుడి మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆకట్టుకునే 'కడపచెట్టు'


పెద్దచెరువు మధ్యలో ఉన్న కడపచెట్టు

మంథనిరూరల్: ఆరెంద పెద్దచెరువు మధ్యలో ఉన్న ఈ చెట్టును కడపచెట్టుగా గ్రామస్తులు వ్యవహరిస్తున్నారు. దీనికి సుమారు వందేళ్లు ఉంటాయంటున్నారు. వర్షాకాలంలో నీటితో నిండితేనే చెట్టు మునిగిపోతుందని, ఆయకట్టు రైతులు ఈచెట్టు చుట్టూ ఉన్న నీటి సామర్థ్యాన్ని చూసే యాసంగి సాగు చేసుకునేవారంటున్నారు. కాలక్రమేనా చెరువు పూడికతో నిండిపోయింది. ఎండాకాలంలో కడపచెట్టు ఎండిపోయి.. మళ్లీ వర్షాకాలంలో పచ్చనిఆకులతో చిగురిస్తుంది. చెరువు నీటితో నిండితే కడపచెట్టు దృశ్యం కనువిందు చేస్తుంది.

మట్టి టిప్పర్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

- 10 టిప్పర్లు, 2 హిటాచీలు స్వాధీనం
- ఎస్పీ మహేశ్ బీ గీతే

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ శివారులోని రామప్ప ఆలయం గుట్టల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న 10 టిప్పర్లు, 2 హిటాచ్చి జేసీబీలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. గుట్ట నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ముగ్గురు ఉత్తమ్ కరుణాకర్, భువనగిరి మహేశ్, లంబ ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశారు.

2న మహిళా క్రికెట్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

జ్యోతినగర్(రామగుండం): ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళా క్రికెట్ జట్టు ప్రిలిమినరి ఎంపిక పోటీలు జూలై 2న నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగమరావు, మురళీధర్‌రావు తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లో జరిగే పోటీలకు జిల్లాజట్టు ఎంపిక కోసం తొలుత ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60 మంది మహిళా క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. వీరిని నాలుగు జట్లుగా విభజించి రౌండ్ రాబిన్ పద్ధతిన కరీంనగర్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన జట్టును రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. ఒకటి సెప్టెంబర్ 2025 నాటికి 15 సంవత్సరాల వయసు నిండి క్రీడాకారులు అర్హులన్నారు. సొంత కిట్, యూనిఫామ్, ధ్రువీకరణ పత్రాలతో జూలై 2న ఆయా ప్రాంతాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని రావాలని వారు సూచించారు. పోటీలు గోదావరిఖని, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌లో ఉంటాయన్నారు. వివరాలకు గోదావరిఖని, ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ 98663 51620, జీఎం ఆఫీస్ గ్రౌండ్, కరీంనగర్, ఇన్‌చార్జి శ్రవణ్, 86887 68775, కేడీసీబీ ఆఫాస్ నెట్స్, జగిత్యాల ఇన్‌చార్జి జలపతి, 99480 64712, వివేకానంద స్టేడియం, జగిత్యాల, సిరిసిల్ల ఇన్‌చార్జి మనోహర్, 84979 79747, రైజింగ్ స్పోర్ట్స్ అకాడమీ, బైపాస్ రోడ్డులో సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు

- రాజీవ్ రహదారిపై అస్తవ్యస్తంగా ప్రయాణం
- రోడ్డుపై వరద నిలుస్తున్నా పట్టించుకోని వైనం
- మూలమలుపుల వద్ద కనిపించని రక్షణ స్తంభాలు
- కానరాని హెచ్చరిక బోర్డులు.. తరచూ రోడ్డు ప్రమాదాలు


రామగుండం బైపాస్ రోడ్డు మధ్యలో నిలుస్తున్న నీరు

రామగుండం: హైదరాబాద్ – కరీంనగర్ – రామగుండం(హెచ్‌కేఆర్) మధ్యగల రోడ్డును రాజీవ్ రహదారిగా వ్యవహరిస్తున్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ), రాష్ట్రప్రభుత్వం, కాంట్రాక్టర్ సంయుక్త భాగస్వామ్యం(పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్–పీపీపీ విధానం)లో ఈ రోడ్డు నిర్మించారు. డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) మోడల్‌లో దీనికి ఒప్పందం కుదిరింది. నిర్వహణ బాధ్యతలు హెచ్‌కేఆర్ రోడ్డు వేస్ చేపట్టింది. భారతదేశంలోని మోటారు వాహన చట్టం, 1988, కేంద్ర మోటారు వాహన నియమాలు, 1989లో పేర్కొన్న నిబంధనలు వర్తించనున్నాయి.

హెచ్‌కేఆర్ సమగ్ర సమాచారం..

రాజీవ్ రహదారి నిర్మాణం కోసం 1995లో ప్రపంచ బ్యాంకు రుణం తీసుకున్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచన విధానంతో రెండు లేన్లు, పది మీటర్ల వెడల్పుతో స్టేట్ హైవేగా నిర్మించారు. 2011లో పనులు ప్రారంభమై 2013లో పూర్తయ్యాయి. షామీర్‌పేట ఓఆర్ఆర్ ప్రవేశం నుంచి మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ ఎక్స్‌రోడ్డు హైవే–63కు రాజీవ్ రహదారిని అనుసంధానించారు. దీని పొడవు సుమారు 206.85 కి.మీ. 22.5 సంవత్సరాలు నిర్వహణ బాధ్యతలు ఉంటాయి. 2035 వరకు హెచ్‌కేఆర్ రోడ్డు నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది.

బాధ్యతలు విస్మరిస్తున్న సంస్థ..

రహదారిపై గతుకులు, పగుళ్లు, శిథిలాలను గుర్తించి సకాలంలో మరమ్మతు చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డుకు ఇరువైపులా సైన్‌బోర్డులు, లైన్ మార్కింగ్స్, జీబ్రా క్రాసింగ్స్ ఉండేలా పర్యవేక్షణ చేయ డం, రోడ్డు డివైడర్లు, రిఫ్లెక్టర్లు, హైవే లైటింగ్, భద్ర తా సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత హెచకేఆర్‌దే. యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, రోడ్డు ప్రమాదాల నియంత్రణకూ చర్యలు చేపట్టడం, ఎమర్జెన్సీ సర్వీస్ (అంబులెన్స్, క్రేన్ సర్వీస్) అందుబాటులో ఉండం ప్రధాన విధి. రహదారి పక్కన పచ్చదనం, చెట్లు నాటడం, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్వహించడం,వర్షాకాలంలో నీటినిల్వ లేకుండా చూడడం, రహదారి పక్కన విశ్రాంతి స్థలాలు, టా యిలెట్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

పొంచిఉన్న ప్రమాదాలు



మల్యాలపల్లి సబ్‌స్టేషన్ నుంచి రామగుండం బైపాస్ మధ్య తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువు రు మృత్యువాతపడ్డారు. రోడ్డు పక్కన డ్రైనేజీ మట్టితో నిండిపోయింది. రోడ్డుకు చివరగా రక్షణ సిమెంట్ దిమ్మెలు విరిగిపోయినా పునరుద్ధరించలేదు. రోడ్డు మధ్యలో వరద నిలిచి ఉంది. వర్షాకాలంలో రోడ్డుపైనే వరద ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మూలమలుపులు, బ్లాక్ స్పాట్స్ వద్ద కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. కానీ, టోల్‌గేట్ ఫీజు వసూలు చేస్తూనే ఉన్నారు.

– సురేశ్‌వర్మ, గ్రామస్తుడు, మల్యాలపల్లి